సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

జూనియర్ బాక్సర్లకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని వాకింగ్ పార్కులో పలువురు జూనియర్ బాక్సర్లకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ నిర్వాహకుల ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు మజ్జి రమేష్ పాత్రుడు, షేక్ ఆలీ, గణేష్, హరి, సాయి, ప్రసాద్ తదితరులు ఫుడ్ అందించారు.

కార్మికులు ఐక్యతతో మెలగాలి

మల్కాపురం: కార్మికులంతా ఐక్యతతో మెలిగినప్పుడే హక్కులను సాధించుకోగలమని కార్గో హ్యాండ్లింగ్ పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఉరుకూటి డేవిడ్ అన్నారు. టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జరిగే మేడే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతూ 61వ వార్డు ఆర్కే పురంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆ యూనియన్ నాయకుడు నక్క లక్ష్మణరావుయాదవ్ ఆధ్వర్యంలో కార్మికులతో సమీక్షించారు. మేడే ఉత్సవాల్లో కార్మికులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

చైతన్యం కోసమే మన్‌కీ బాత్



మన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గోపాలపట్నం: మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను బీజేపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో ఎన్‌ఏడీ జంక్షన్ శివాలయం వద్ద వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో విజయదశమి నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా అడిగి తెసులుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో చల్ల మంజుల, భీశెట్టి నారాయణ, చంద్రశేఖర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఉక్కు'లో యువ కార్మికుల నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు సోమవారం నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు కాకపోవడంతో కార్మిక సంఘాలకు అతీతంగా గత కొన్ని రోజులుగా వారు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మేడే సందర్భంగా ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపనున్నట్టు యువ కార్మికులు జెర్రిపోతుల మోహన్‌కుమార్, కోరాడ వెంకటరావు తెలిపారు.

సమస్యలతో సతమతం

- 56వ వార్డులో సమస్యల తిష్ట
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, కార్పొరేటర్



తోట వీధిలో గోతులమయమైన సీసీ రోడ్డు



ఆర్పీ పేట రైల్వే గేటు రహదారిలో వెలగని విద్యుత్ లైట్లు



గొల్ల కంచరపాలెంలో అధ్వానంగా కాలువ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డులో అనేక సమస్యలు తిష్ట వేశాయి. స్థానిక కార్పొరేటర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని వార్డు ప్రజలు వాపోతున్నారు. గొల్లకంచరపాలెం నుంచి గౌరీనగర్ వరకు గల తోట వీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్, చెవుటిరాముల వీధి, మల్లసూరి వీధి తదితర ప్రాంతాల్లో ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాలనీల వాసులు కాళ్లరిగేలా తిరుగుతున్నా.. ఫలితం లేకుండా పోయిందంటున్నారు. సమస్యలతోనే సహవాసం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉన్న శ్రద్ధ.. మౌలిక వసతుల కల్పనపై కార్పొరేటర్ లేదని పలువురు విమర్శిస్తున్నారు.

అధ్వానంగా రహదారులు

నిరంతర తాగునీటి పైప్‌లైన్ పనుల నిమిత్తం కొన్నేళ్ల కిందట ఆయా కాలనీల్లోని రహదారుల మధ్యలో గోతులు తవ్వి వదిలేశారు. నేటికీ వాటిని పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో అధ్వానంగా మారాయి. వర్షాల సమయంలో గోతుల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. సీసీ రోడ్లు మట్టి మార్గాలను తలపిస్తున్నాయి.

అస్తవ్యస్తంగా డ్రైనేజీలు

వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. రోడ్లకు ఆనుకుని ఉన్న కాలువలు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరాయి. మురుగు నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడేస్తున్నాయి. చెత్త తొలగింపు, పారిశుద్ధ్య నిర్వహణ దారుణంగా ఉంది. గొల్లకంచరపాలెం నుంచి గౌరీనగర్ వరకు గల రైల్వే ట్రాక్ రహదారి ప్రధాన గెడ్డలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. ఈ సమస్యపై పబ్లిక్ హెల్త్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వెలగని విద్యుత్ లైట్లు

ఆయా కాలనీల్లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగడం లేదు. మరికొన్ని చోట్ల పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. రాత్రి వేళ అంధకారంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఈ సమస్యలపై జోనల్ అధికారులు, కార్పొరేటర్‌కు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఫిర్యాదులు పట్టించుకోవడం లేదు

మా కాలనీలోని సమస్యలపై అధికారులు, స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండటం లేదు. ఎంతో కాలం కిందట కాలనీ రహదారుల మధ్య తవ్విన గోతులను నేటికీ పూడ్చలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.

– నక్కా లక్ష్మి, గొల్లకంచరపాలెం

అధికారులు దృష్టి సారించాలి

మా ప్రాంత సమస్యలపై జోన్–5 కమిషనర్, ఇతర అధికారులు దృష్టి సారించాలి. వార్డులో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యటించి సమస్యలు పరిశీలించాలి. రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్ లైట్ల సమస్యలను పరిష్కరించాలి.

– కర్రి రాంబాబు, దుర్గానగర్

ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



ఫుట్‌పాత్‌పై ఉన్న వారికి మజ్జిగ అందిస్తున్న సంతోష్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో స్థానిక ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అలయంలో మల్కాపురానికి చెందిన పలువురు ఆర్య వైశ్య సామాజిక వర్గ మహిళలు కుంకుమార్చనలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు మజ్జిగ పంపిణీ, అన్నదానం చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేష్ నిర్వాహకులతో కలిసి అమ్మవారికి పూజలు చేసి, అన్నప్రసాదం వడ్డించారు.

నిరాశ్రయులు, యాచకులకు మజ్జిగ పంపిణీ

61వ వార్డు మల్కాపురానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కాకి సంతోష్ స్థానిక ఫుట్‌పాత్, బస్టాప్‌ల వద్ద ఉండే నిరాశ్రయులు, యాచకులకు ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు.

డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై సమీక్ష



సుసర్ల కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బొమ్మిడి రమణ

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు సుసర్ల కాలనీలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై కార్పొరేటర్ బొమ్మిడి రమణ క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ఆదివారం సుసర్ల కాలనీలో ఆయన పర్యటించారు. అక్కడి వీధుల్లో నిరంతర తాగునీటి సరఫరా కోసం తవ్విన గోతులను సక్రమంగా పూడ్చక పోవడం, డ్రైనేజీలు పాడై ఉండటాన్ని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిని బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. మురళీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు సాయపడండి



మాట్లాడుతున్న రిటైర్డ్ కల్నల్ సుబ్బారావు

సీతంపేట: కుటుంబ ఆదరణ లేని వయోవృద్ధులకు సాయపడాలని రిటైర్డ్ కల్నల్ సుబ్బారావు పిలుపునిచ్చారు. వింటేజ్ విశాఖ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎ.హైమావతి, జి.మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఫోరం సమావేశం నిర్వహించారు. పలువురు సీనియర్ సిటిజన్లు తమ అభిప్రాయాలు, ఆలోచనలు సభకు తెలియపర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 17 శాతం సీనియర్ సిటిజన్లు ఉన్నారని, వారికి అవసరమైన డే కేర్ సెంటర్లు, రిక్రియేషన్, వెల్ఫేర్ కోసం అడిగే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇది కావాలని ప్రభుత్వాన్ని, అధికారులను అడిగేందుకు ముందుకు రావడం లేదన్నారు. సీనియర్ సిటిజన్లు తాము నివసించే ప్రాంతంలో ఉన్న వయోవృద్ధులతో ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసి జిల్లా సంఘానికి అనుబంధం చేసుకుంటే బలం పెరుగుతుందని సూచించారు. మానసిక బాధలో ఉన్న వయోవృద్ధులకు తాము ఉన్నామని చేయి సాయంగా అందివ్వాలని సుబ్బారావు కోరారు. కార్యక్రమంలో ఫోరం కోశాధికారి డాక్టర్ మురళీరాజ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



పాదచారులకు మజ్జిగ అందిస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా అన్నారు. వార్డులోని జైఆంధ్ర కాలనీలో ముస్లింలు ఆదివారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రాజా, స్థానిక నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

వైభవుడి కల్యాణోత్సవం నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమవుతాయి. ఆలయం నిర్మించి 21 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 5 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. త్రయాహ్నిక దీక్షతో పాంచరాత్రగమ విధానంలో ఉత్సవాలు జరుగుతాయి. సోమవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాల భోగం, మంగళాశాసనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విత్వరుణ చేస్తారు. సాయంత్రం 5 గంటలకు ఎదురు సన్నాహోత్సవం, 6 గంటలకు శ్రీనివాసుడి కల్యాణం జరుగుతుంది.

ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ పోటీలు



టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: వైజాగ్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఒక రోజు నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీలను ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల ఉల్లాసంగా ఉంటుందని తెలిపారు. ఎన్ఎస్టీఎల్ క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఎన్ఎస్‌టీఎల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయని వీడీటీటీఏ కార్యదర్శి డాక్టర్ డీవీఎస్‌వై శర్మ తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ పోటీలు సాయంత్రం 6.30 గంటకు ముగిసాయి. ఫైనల్లో పోర్టు – రైల్వేస్ జట్లు తలపడ్డాయి. విన్నర్‌గా పోర్టు జట్టు నిలిచింది. కార్యక్రమంలో సీఈయూనియన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి జేఎన్ వర్మ, కార్యదర్శి నాగభూషణం, స్పోర్ట్స్ సెక్రటరీ ఎస్‌కే సాహు, స్పోర్ట్స్ చైర్మన్ సీహెచ్ జయరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎనలేనిది



పారిశుద్ధ్య కార్మికులకు శానిటరీ సామగ్రి అందిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎనలేనిదని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏకేసీ కాలనీలో జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సచివాలయ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తిబాబు పర్యవేక్షణలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు, గ్లౌజులు, జాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరారవు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచడమే కాకుండా వారి ఆరోగ్యం దృష్ట్యా పలు సంక్షేమ పథకాలు, వైద్య సదుపాయలను అందబాటులోకి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో వరపల మహేష్, అన్నెపు సూర్యనారాయణ, శ్రీను, కొండబాబు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట : ఏపీ జేఏసీ (అమరావతి) విశాఖ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. పరిశీలకుడిగా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ కృష్ణమూర్తి వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా సత్తి నాగేశ్వరరెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు(ఆర్టీసీ), అసోసియేట్ చైర్మన్‌గా ఎస్.ఎ.త్రినాథరావు (రెవెన్యూ, డిప్యూటీ తహసీల్దార్), వైస్ చైర్మన్‌గా ఎ.శ్రీనివాసరావు (దివ్యాంగుల శాఖ), నమ్మి శ్రీనివాసరావు (నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం), సీహెచ్ రామకృష్ణమూర్తి (భాషా పండితుల సంఘం), వైస్ చైర్మన్ (ఉమెన్ వింగ్) డాక్టర్ పూర్ణిమ (వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీసెస్ అసోసియేషన్) కార్యదర్శి కె.సురేష్‌కుమార్(గ్రామవార్డు సచివాలయాలు), ఎ.శ్రీనివాసరావు (పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్), కార్యదర్శి ఎన్.మేఘ శ్యామ్ వెంకటేష్ యాదవ్ (ఏపీ స్టేట్ లేబర్ డిపార్టుమెంట్), కార్యదర్శిగా పీయూఎస్ మహేష్ (ఏపీ రెవెన్యూ అసోసియేషన్), కార్యదర్శి (ఉమెన్ వింగ్) ఆర్. అనూష (ఏపీ రూరల్ వాటర్ సప్లైస్ ఇంజినీర్స్), కోశాధికారిగా బి.రవిశంకర్ (డిప్యూటీ తహసీల్దార్) తదితరులు ఎన్నికయ్యారు.

పబ్లిక్ డిమాండ్

సర్వీస్ రోడ్డులో ఇసుక డంపింగ్



గుల్లలపాలెం రోడ్డును ఆక్రమించిన ఇసుక

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు దుర్గా బార్ పక్క నుంచి గుల్లలపాలేనికి వెళ్లే సర్వీస్ ఇసుకను నిర్లక్ష్యంగా డంప్ చేశారు. ఈ కారణంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రాత్రి వేళ విద్యుత్ లైట్ల సదుపాయం లేకపోవడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– టి.అప్పలరాజు, గుల్లలపాలెం

విభజన హామీలను విస్మరించిన కేంద్రం



808వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విభజన హామీల విస్మరించి రాష్ట్రంలో అతిపెద్ద పరిశ్రమగా ఎదిగిన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులుకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం అన్యాయమని పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు 808వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్ని సర్వనాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. ఈ ప్రయత్నాలను సంస్థలోని కార్మికులందరు ఐక్యంగా ఎదుర్కొవాలన్నారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.